డబ్బులు తిరిగి ఇవ్వలేదని..

కార్లను కాల్చేశాడు

శ్రీనాని కార్స్ అగ్నిప్రమాదం ఘటనలో నిందితుడి అరెస్టు

బంజారాహిల్స్, మే 9: తనకు రావాల్సిన బకాయి డబ్బులు తిరిగి ఇవ్వలేదన్న కోపంతో సెకండ్ హ్యాండ్ కార్స్ సంస్థ ఆవరణలో పార్క్ చేసిన కార్లను పెట్రోల్ పోసి తగలబెట్టిన నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ ఎస్ఐ రమ కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ గణపతి కాంప్లెక్స్ సమీపంలో శ్రీనాని కార్స్ పేరుతో సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయ కేంద్రాన్ని నరేందర్ నిర్వహిస్తున్నాడు. గత నెల 23న శ్రీనాని కార్స్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించి అక్కడున్న 19 కార్లు పూర్తిగా కాలిపోగా, మరో నాలుగు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. యజమాని నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా ఘటన జరిగిన సమయంలో ఓ వ్యక్తి అక్కడ తచ్చాడినట్లు గుర్తించారు. మరికొన్ని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితుడు కిస్మత్‌పూర్‌కు చెందిన అన్వేశ్ (34)గా గుర్తించి, అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. రెండేండ్ల కిందట నాని కార్స్‌లో రూ.3.40 లక్షలకు అన్వేశ్ ఓ కారు కొనుగోలు చేశాడు. రూ.3 లక్షలు చెల్లించినా.. నాని కారు యజమాని అన్వేశ్ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించలేదు. నెలలు గడిచినా కారు అన్వేశ్ పేరుపై బదిలీ చేయకపోవడంతో పాటు అతడికి ఫైనాన్స్ కూడా రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తనకు కారు వద్దని, తాను చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా.. సగం డబ్బును నరేందర్ తిరిగి చెల్లించాడు. మిగిలిన మొత్తాన్ని చెల్లించకుండా దాటవేస్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురైన అన్వేశ్ గత నెల 23న పెట్రోల్ తీసుకువచ్చి.. శ్రీనాని కార్స్‌లో ఉన్న కార్లపై పోసి నిప్పంటించాడు. కాగా, తనకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడం వల్లే తాను ఈ పనిచేశానని నిందితుడు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడు అన్వేశ్‌ను గురువారం అరెస్టు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రమోటర్లు కావాలి

సిటీబ్యూరో, మే 9(నమస్తే తెలంగాణ): పర్యావరణ పరిరక్షణలో షార్ట్ ఫిలిం మేకర్లు భాగస్వామ్యం కావాలని కాలుష్య నియంత్రణ మండలి సూచించింది. వాతావరణ కాలుష్యం, పర్యవసానాలు, కాలుష్య నియంత్రణ చర్యలు, పచ్చదనం ప్రాముఖ్యత, నీటి కాలుష్యం కట్టడి, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించేలా వీడియోలను రూపొందిస్తే తగిన పారితోషికంతో పాటు సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లుగా తెలిపారు. పూర్తి వివరాలకు పీసీబీ కో ఆర్డినేటర్ సోమేశ్ కుమార్ (9908179676), నాగేశ్వర్ రావు (9177303127) నంబర్లలో పీసీబీ అధికారులను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేలి ముద్రలతో మృతుడి ఆచూకీ

గుర్తు తెలియని వ్యక్తి హత్యకేసును ఛేదించిన జూబ్లీహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్, మే 9: యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ కింద జరిగిన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును జూబ్లీహిల్స్ పోలీసులు ఛేదించారు. మృతుడికి సంబంధించిన వివరాలు లేకపోయినా.. అతడి వేలిముద్రల సాయంతో ఆచూకీ కనుగొని, ఈ కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీ కృష్ణానగర్ మెయిన్ రోడ్డులో ఉన్న మెట్రో స్టేషన్ కింద మూడు రోజుల కిందట గుర్తు తెలియని ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. హత్యకు గురైన వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియకపోవడంతో.. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన అనంతరం మార్చురీలో మృతదేహాన్ని భద్రపర్చారు. కాగా, చనిపోయిన వ్యక్తి ఎవరనే విషయాన్ని తెలుసుకునేందుకు అతడి వేలిముద్రలు సేకరించిన పోలీసులు.. స్టేట్ ఫింగర్ ప్రింట్స్ బ్యూరోకు పంపించారు. ఈలోగా మృతుడి ఫొటోను స్థానికులకు చూపించగా.. అదే ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై తచ్చాడుతుండేవాడని తేలింది. వేలిముద్రల ఆధారంగా హత్యకు గురైన వ్యక్తి గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన రౌడీషీటర్ ఎర్రవల్లి రాహుల్(30) అని గుర్తించారు. ఏడాదిన్నర కాలంగా కృష్ణానగర్ ప్రాంతంలోనే ఉంటున్నాడని, సినిమా షూటింగ్స్‌కు వెళ్లి వచ్చే వారిని బెదిరించి డబ్బులు వసూలు చేస్తూ.. మద్యం తాగి ఆవారాగా తిరిగేవాడని పోలీసులు గుర్తించారు. ఇదే క్రమంలో సీసీ పుటేజీల సాయంతో ఇద్దరు వ్యక్తులు రాహుల్‌ను హత్య చేసినట్లు తెలిసింది. స్థానికులిచ్చిన సమాచారం ఆధారంగా నిందితులు కోస్గి సమీపంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన కె.సతీశ్ (39), సదాశివపేటకు చెందిన మల్లపు రమేశ్‌గా గుర్తించారు. వారిద్దరినీ గురువారం సాయంత్రం అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. సినిమా సెట్‌వర్క్స్‌లో పనిచేస్తుంటే ప్రతి వారం తమని బెదిరించి రాహుల్ డబ్బులు లాక్కునే వాడని, డబ్బులు ఇవ్వకపోవడంతో ఇటీవల దాడి చేశాడని, దీంతో అతడిని హత్య చేశామని నిందితులు అంగీకరించారు. నిందితులిద్దరూ మద్యం సేవించి రాహుల్‌ను కర్రలతో దారుణంగా కొట్టడంతో పాటు మర్మాంగాలను మెలిపెట్టి చంపేశారని దర్యాప్తులో తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ స్పిరిట్ నిల్వ కేంద్రాలపై దాడులు

రూ.2.31కోట్ల విలువ చేసే స్పిరిట్ సీజ్.. ఇద్దరి అరెస్టు

కుత్బుల్లాపూర్, మే 9: నిబంధనలకు విరుద్ధంగా రెక్టిఫైట్ స్పిరిట్‌ను నిల్వ ఉంచిన స్థావరంపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2.31 కోట్ల విలువైన 21 వేల లీటర్ల రెక్టిఫైట్ స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం... హనుమాన్ రామ్‌సేన్, హరిరామ్ గత కొంతకాలంగా దూలపల్లి పారిశ్రామిక వాడలోని సర్వేనంబర్ 135లో జగదాంబ కెమికల్స్ కంపెనీకి చెందిన గోదాంను నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా వైట్నర్, ఇతర మత్తు పదార్థాల్లో వినియోగించే రెక్టిఫైట్ స్పిరిట్‌ను వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఈ గోదాంలో గుట్టుచప్పుడు కాకుండా నిల్వ చేస్తున్నారు. ఈ విధంగా నిలువ చేసిన స్పిరిట్‌ను వివిధ రకాల మత్తు పదార్థాల తయారీదారులకు అక్రమంగా సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం స్పిరిట్ గోదాంపై మెరుపు దాడులు జరిపారు. ఈ దాడుల్లో రూ.2.31కోట్ల విలువ చేసే 21 వేల లీటర్ల రెక్టిఫైట్ స్పిరిట్ డ్రమ్ములను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

సిటీ నేచర్ చాలెంజ్‌లో నగరానికి అగ్రస్థానం

నేచురల్ హిస్టరీ మ్యూజియం వెల్లడి

హైదరాబాద్, మే 9 (నమస్తే తెలంగాణ) : సిటీ నేచర్ చాలెంజ్-2024లో హైదరాబాద్ వరుసగా రెండోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఏప్రిల్ 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు లాస్ ఎంజిల్స్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం (ఎన్‌హెచ్ఎం) నిర్వహించిన ఈ చాలెంజ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న నగరాలు, పట్టణాల్లో హైదరాబాద్ వరుసగా అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్ 2023లో ఈ ఈవెంట్‌లో పాల్గొనడం ప్రారంభించింది. దేశంలో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉండగా, ఉత్తరాఖండ్‌లోని నానక్‌మట్ట రెండో స్థానంలో నిలిచింది. 670కి పైగా నగరాలు, పట్టణాలు వార్షిక గ్లోబల్ ఈవెంట్‌లో పాల్గొన్నాయి. హైదరాబాద్ హాంకాంగ్ తర్వాత ఆసియాలో రెండో స్థానంలో ఉంది. ప్రపంచంలో 13వ స్థానంలో ఉంది. నాలుగు రోజుల ఈవెంట్‌లో 527 మంది పరిశీలకులు వృక్షజాలం, జంతుజాలంతో సహా 2,092 జాతులను తనిఖీ చేశారు. ఈ పరిశీలకులు నాలుగు రోజుల్లో 34,388 పరిశీలనలు చేశారు. వేపచెట్టు (262), రావిచెట్టు -సేక్రెడ్ ఫిగ్ (135) ఎక్కువగా గమనించిన మొక్కలు కాగా, నెమలి (206), రెడ్ వెంటెడ్ బుల్బుల్-పిగిలిపిట్ట హైదరాబాద్‌లో ఎక్కువగా గమనించిన పక్షి జాతులు.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశీలకుల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని పక్షి పరిశీలకుడు శ్రీరామ్‌రెడ్డి తెలిపారు. సిటీ నేచర్ చాలెంజ్‌ను కాలిఫోర్నియా అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన అలిసన్ యంగ్, రెబెక్కాజాన్సన్, లాస్ ఏంజిల్స్ కౌంటీలోని నేచురల్ హిస్టరీ మ్యూజియం లీలా హిగ్గిన్స్ ప్రారంభించారు. సిటీ నేచర్ చాలెంజ్ లక్ష్యం పట్టణ జీవవైవిధ్యాన్ని డాక్యుమెంట్ చేయడమేనని శ్రీరామ్‌రెడ్డి తెలిపారు.

బాచుపల్లి ఘటనలో అరవింద్‌రెడ్డి సహా ఐదుగురి అరెస్టు

దుండిగల్,మే 9: బాచుపల్లి రేణుకాఎల్లమ్మ కాలనీలో గోడ కూలిన ఘటనలో ఏడుగురి మృతికి కారకులైన భవన నిర్మాణ సంస్థ యజమానితో పాటు మరో నలుగురిని పోలీసులు గురువారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ కథనం ప్రకారం.. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రేణుకా ఎల్లమ్మ కాలనీలో సుమారు రెండున్నర ఎకరాల స్థలంలో హార్జాన్ రైజ్ అనే నిర్మాణ సంస్థ హెచ్ఎండీఏ అనుమతులతో సెల్లార్, స్టిల్ట్+5 అంతస్తులతో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నది. అయితే, ఓ అపార్ట్‌మెంట్ చుట్టూ నిర్మించిన రిటైనింగ్‌వాల్ నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో పాటు అధికంగా ఎత్తు నిర్మించడంతో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి కుప్పకూలింది. రిటైనింగ్ వాల్‌తో పాటు అపార్ట్‌మెంట్ బరంతి కోసం పోసిన మట్టి ఒక్కసారిగా ఆ పక్కనే ఉన్న కూలీల గుడిసెలపై పడటంతో ఓ నాలు గేండ్ల బాలుడు సహా ఆరుగురు వలస కార్మికులు మట్టిలో కూరుకుపోయి, దుర్మరణం చెందిన విషయం విధితమే. ఈ ఘటనలో నాసిరకం నిర్మాణ పనులు చేపట్టడంతో పాటు కార్మికులకు సరైన భద్రత కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, ఏడుగురి మృతికి కారకులైన హార్జాన్ రైజ్ నిర్మాణ సంస్థ యజమాని, బిల్డర్ అరవింద్‌రెడ్డితో పాటు సైట్ ఇంజినీర్ మురుగాసేన్ సతీశ్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ మరియా ఫ్రాన్సిస్ జావియర్ రాజ్, కాంట్రాక్టర్లు దండ్యాల రాజేశ్, అల్లు రాంరెడ్డిపై ఐపీసీ 304 పార్టు-2, 337 రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు.. గురువారం నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

సైడ్‌వాల్ కడుతూ.. కరెంట్ షాక్‌తో తాపీ మేస్త్రి మృతి

దుండిగల్, మే 9: విద్యుత్‌షాక్‌కు గురై తాపీ మేస్త్రి మరణించాడు. దుండిగల్ పోలీసుల కథనం ప్రకారం.. సూరారం కాలనీ పరిధిలోని సుందర్‌నగర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం సమీపంలో నివాసముంటున్న కలిబిలి రోషిణి, మహేశ్ (27) దంపతులు. మహేశ్ తాపీ మేస్త్రిగా పనిచేస్తుండగా., రోషిణి గృహిణి. మహేశ్ గతకొన్ని రోజులుగా వరుసకు సోదరుడైన వర్మతో కలిసి సూరారం కాలనీలో 60 గజాల ఇండ్ల సమీపంలో కృష్ణ అనే వ్యక్తి నిర్మిస్తున్న ఇంటి పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం రోజువారీ మాదిరిగానే మహేశ్, వర్మ ఇంటి నిర్మాణ పనులకు వెళ్లారు. భవనానికి సంబంధించి మొదటి అంతస్తు నుంచి కింది వరకు సైడ్‌వాల్ (పరదా) కడుతూ ప్రమాదవశాత్తు ఇంటి పక్క నుంచి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు తగలడంతో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. ఒక్కసారిగా భవనం పైనుంచి కిందపడి పోయాడు. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం మల్లారెడ్డి వైద్యశాలకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మహేశ్ మరణించినట్లు తెలిపారు. భవన యజమాని కృష్ణ, కాంట్రాక్టర్ టి.శేఖర్ నిర్లక్ష్యమే కారణమని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి భార్య రోషిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'టాపెంటడాల్' మాత్రలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): నొప్పి నుంచి ఉపశమనం కలిగించేందుకు, శస్త్ర చికిత్సల సమయంలో వినియోగించే 'టాపెంటడాల్' మాత్రలను దుర్వినియోగం చేస్తూ.. అనుమతి లేకుండా మత్తుకు బానిసలైన వారికి విక్రయిస్తున్న వ్యక్తిని పాతబస్తీ పోలీసులతో కలిసి డీసీఏ అధికారులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.23 వేల విలువైన 400 మాత్రలను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. అధికారుల కథనం ప్రకారం.. నొప్పుల నుంచి ఉపశమనం కలిగించేందుకు వినియోగించే 'టాపెంటడాల్' మాత్రలు మత్తును కలిగించే స్వభావాన్ని కలిగి ఉంటాయి. దీనిని ఆసరాగా చేసుకుని యాకత్‌పుర ప్రాంతానికి చెందిన అర్షద్ ఖాన్ చార్మినార్ బస్టాండ్ వద్ద ఉన్న పార్కింగ్ ఏరియాలో మత్తుకు బానిసలైన వారికి ఈ మాత్రలను గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న డీఏసీ అధికారులు హుస్సేనీఆలం పోలీసులతో కలిసి నిందితుడిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.23 వేల విలువ చేసే 400 మాత్రలను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు.

ఇండియా, అమెరికా ట్రేడింగ్ అంటూ..

రూ.48 లక్షలు స్వాహా చేసిన సైబర్ చీటర్స్

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): ఒక ప్రభుత్వ ఉద్యోగి ఏడాది కాలంగా స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చేస్తున్నాడు.. ఇటీవల ఫేస్‌బుక్‌లో ట్రేడింగ్‌కు సంబంధించిన ప్రకటనను చూసి.. దానిని క్లిక్ చేసి, వీ5 బ్రాడ్ సెక్యూరిటీస్ గ్రూప్ అనే వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. అందులో 93 మంది ఉన్నారు. ఇండియా, అమెరికా స్టాక్ మార్కెట్‌లో మంచి లాభాలున్నాయంటూ చర్చించుకోవడం చూసిన బాధితుడు.. తాను కూడా వాళ్లతో కలిశాడు. గ్రూప్‌లో రోజు వారీగా ఇండియా, అమెరికాలోని స్టాక్స్‌కు సంబంధించిన వివరాలు పెడుతూ.. లాభాలు రోజు వారీగా ఎలా వస్తున్నాయని వివరించారు. సెక్యూరిటీస్.కామ్ పేరుతో నేరగాళ్లు తయారు చేసిన ఒక వెబ్‌సైట్‌లో ట్రేడింగ్ ఖాతాలు తీసుకొని ఇండియా, అమెరికా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టారు. మొదట్లో లాభాలు చూపించడంతో నిజమని నమ్మిన బాధితుడు, అతడి భార్య ఇద్దరూ ఆ గ్రూప్‌లో సభ్యులుగా చేరి.. వాట్సాప్ గ్రూప్‌లో వచ్చే మెసేజ్‌లతో ఉత్సాహం పొందుతూ నేరగాళ్ల ట్రాప్‌లోకి వెళ్లిపోయారు. ఇలా దఫ దఫాలుగా రూ. 48 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయారు. ఈ ట్రేడింగ్‌పై ఆరా తీయడంతో ఇదంతా నకిలీదని, మోసపోయానని గుర్తించి సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): ఎల్బీస్టేడియంలో శుక్రవారం జరిగే బీజేపీ బహిరంగ సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నారు. పీఎం పర్యటించే సమయంతో పాటు సభ దృష్ట్యా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. ప్రధానమంత్రి బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ఎల్బీస్టేడియానికి ఎయిర్‌పోర్టు వై జంక్షన్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రాజ్‌భవన్ రోడ్డు, ఖైరతాబాద్ జంక్షన్, నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ మార్గ్, తెలుగుతల్లి జంక్షన్, ఇక్బాల్ మీనార్, రవీంద్ర భారతి నుంచి ఎల్బీస్టేడియానికి చేరుకుంటారు. సభ అనంతరం తిరిగి అదే రూట్‌లో బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఆయన ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ మళ్లింపు, ట్రాఫిక్ నిలిపివేయడం ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

బాలికపై లైంగికదాడి.. ఆపై బ్లాక్‌మెయిల్

బంజారాహిల్స్, మే 9: పదో తరగతి బాలికతో పరిచయం పెంచుకుని, లైంగికదాడికి పాల్పడటంతో పాటు ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ డబ్బులు డిమాండ్ చేస్తున్న బాలుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసముంటున్న బాలిక (14)కు రెండేళ్లుగా అదే ప్రాంతానికి చెందిన బాలుడు (17)తో పరిచయం ఉంది. ఆ బాలుడు స్నేహంగా నటిస్తూ బాలికకు దగ్గరవ్వడంతో పాటు రెండు నెలల కిందట ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా.. అప్పుడప్పుడూ బాలికకు ఫోన్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బాలికను బెదిరిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె తల్లి బుధవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్స్ చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా.. జువైనల్ హోమ్‌కు తరలించారు.

రూ. 11 లక్షల నగదు సీజ్

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లాలో తనిఖీలు నిర్వహించిన ఎస్‌ఫోర్స్‌మెంట్ బృందాలు 24 గంటల వ్యవధిలో రూ.11.71 లక్షల నగదు సీజ్ చేశాయి. రూ.1.78లక్షల విలువజేసే వస్తువులు, 157 లీటర్ల మద్యాన్ని పట్టుకుని, ఆరుగురిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు.

కేపీహెచ్‌బీలో..

బాలానగర్ : సరైన పత్రాలు లేకుండా వసంత్‌నగర్ నుంచి తరలిస్తున్న రూ. 53,35,700 నగదును కేపీహెచ్‌బీ, సీఐఎస్ఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు రూ.53, 35,700 నగదును తరలిస్తున్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు ఆ నగదును పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. ఆ నగదు ఎంజీఎం కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి చెందినదిగా ఆ సంస్థ నిర్వాహకుడు మురళీ పోలీసులకు సూచించినట్లు సమాచారం.

అస్కాన్‌ఘడ్‌లో 1.8 కోట్ల విలువైన..

మలక్‌పేట: మలబార్ గోల్డ్ జ్యువెల్లరీ సంస్థ రూ.1.8 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, వజ్రాలను ఓమ్నీ వ్యాన్‌లో తరలిస్తుండగా.. వ్యాన్ చెడిపోయింది. ఆ వ్యాన్‌లోని ఆభరణాలను మరో వాహనంలోకి షిఫ్టు చేస్తుండగా.. అనుమానించిన పోలీసులు, వాటిపై ఆరా తీయడంతో వారు పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులు తనిఖీ చేసి, రూ.1.8 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, వజ్రాలు పట్టుకున్నారు. ఆభరణాలకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో సీజ్‌చేసి, ఎన్నికల సంఘం అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ జయంత్ తెలిపారు.

ఆధారాలను పరిశీలించి.. నగదు విడుదల

వెల్లడించిన ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో, మే 9(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి, అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులను పట్టుకుంటున్నాయని ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ తెలిపారు. ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బు, వస్తువులకు సంబంధించిన కేసులను జిల్లా గ్రీవెన్స్ కమిటీ (డీజీసీ) ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆధారాలు పరిశీలించి విడుదల చేస్తున్నట్టు తెలిపారు. గ్రేటర్ పరిధిలో నమోదైన 166 కేసులకు..159 కేసులను పరిష్కరించి, రూ. 4.76 కోట్లు నగదు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగం కోసం వెళ్లిన మహిళకు వేధింపులు

పోలీసులకు ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

వెంగళరావునగర్, మే 9: ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యావని, ఇంటికి వస్తే సిమ్ కార్డ్ ఇస్తానని నమ్మించాడు. ఇంటికి వచ్చిన ఆ మహిళపై లైంగికదాడికి యత్నించాడో కామాంధుడు. అతడి బారి నుంచి బాధితురాలు తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేటలో ఉన్న వాసవి ఎంపి ఎం గ్రాండ్ కాంప్లెక్స్‌లోని టెక్ ఫ్లో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కు ఉద్యోగం కోసం వచ్చిన మహిళ (36)ను ఇంటర్వ్యూ చేసిన కంపెనీ సీనియర్ ఐటీ ఎక్స్‌పర్ట్ కమ్ మేనేజర్ నవీన్ కుమార్ (29)కు దుర్బుద్ధి పుట్టింది. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యావని.. ఆఫీస్ సిమ్ కార్డ్‌ను ఎల్లారెడ్డిగూడలోని తన ఇంటికొచ్చి తీసుకోవాలని నవీన్ చెప్పాడు. మంగళవారం సాయంత్రం అతడి ఇంటికి ఆ మహిళ వెళ్లింది. మాయమాటలు చెప్పి.. ఇంట్లోకి తీసుకుని వెళ్లాడు. మాటల్లో పెట్టి లైంగికదాడికి యత్నించాడు. కామాంధుడి బారి నుంచి తప్పించుకున్న బాధితురాలు.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన

తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రీకోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది:**20-మే-2024**న మ. **12.30** గం. నుండి మ. **3.30** గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.

రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c సం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	తార్నాక	xxxxxxxxxx7382	మామిడి దీపా పవార్	310714.37	01-ఫిబ్రవరి-24	78.6	76.3
2	మాదాపూర్, హైదరాబాద్	xxxxxxxxxx3868	ఇందుకూరి మోహన్ రాజు	1260303	28-డిసెంబర్-23	645.5	450.8
3	మాదాపూర్, హైదరాబాద్	xxxxxxxxxx5187	ఇందుకూరి మోహన్ రాజు	166839	28-డిసెంబర్-23	46.5	45.1
4	మహబూబ్‌నగర్ (TG)	xxxxxxxxxx8315	కాళహస్తి రామ్ మోహన్	63205	28- ఫిబ్రవరి-24	19.35	15.8
5	చేవెళ్ళ	xxxxxxxxxx9407	S మాధవి	112537.9	28- ఫిబ్రవరి-24	36.2	31
6	చేవెళ్ళ	xxxxxxxxxx4502	అగిరాల నరేష్	106122.59	28- ఫిబ్రవరి-24	30	26.8
7	చందానగర్, హైదరాబాద్	xxxxxxxxxx0660	గంగిరెడ్డి గారి నరేంద్రరెడ్డి	339402.11	28- ఫిబ్రవరి-24	100.8	82.7
8	వివేకానందనగర్ HYD TG	xxxxxxxxxx7849	దొపతి సుహాస్ చంద